క్లుప్తంగా

శ్రీ వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రెంటచింతల: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన శ్రీ వాసవి అమ్మవారికి శ్రావణ మాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని పుట్టింటి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్ఠి శ్రీనివాసశర్మ నేతృత్వంలో అమ్మవారికి వివిధ పూజా కార్యక్రమాలతో పాటు లలితాసహస్ర పారాయణ జరిపించి భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయంత్రం 5గం. నుంచి సకల దేవతామూర్తుల నిలయమైన గోమాతను ప్రత్యేకంగా అలంకరించి వాసవి అమ్మవారికి సమర్పించే సారెను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు నాళం పెదబాబు, గుండా రామ్మూర్తి, ఆకుల నర్సింహరావు, పల్చూరి రాముడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యక్తిపై దాడి ఘటనలో కేసు నమోదు

మాచవరం: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు. మండలంలోని కొత్త గణేశపాడు గ్రామానికి చెందిన దొంత గురవయ్య జీవాలను మేపుకునేందుకు గ్రామ శివారులో సుమారు 12 ఎకరాల బీడు భూమిని కౌలుకు తీసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన నమ్ముల వెంకటాద్రి, గంగాద్రి అనే వ్యక్తులు అదే బీడు భూముల్లో జీవాలు మేపుతుండగా, బీడును తాను కౌలుకు తీసుకున్నానని, మీరెందుకు జీవాలు మేపుతున్నారని గురవయ్య ప్రశ్నించాడు. ఇరువురి మధ్య వాగ్వివాదం జరుగగా గురవయ్యపై వెంకటాద్రి, గంగాద్రి కర్రలతో దాడి చేశారు. ఘటనలో గురవయ్యకు గాయాలు కాగా, గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఆసుపత్రి వైద్య నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో కనక దుర్గ అమ్మవారు



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లోని కనక దుర్గ అమ్మవారు ప్రత్యేకంగా దర్శన మిచ్చారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. ఆలయ పూజారి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

21తో ముగియనున్న ఓటర్ల జాబితా సర్వే

శావల్యాపురం: ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 32 వేల 810 ఓట్లు ఉండగా 34 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోలు 23 వేల 563 మంది ఓటర్ల సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. ఈనెల 21న ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఫామ్–6 అర్జీలు సమగ్ర సమచారంతో ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. సర్వే ప్రక్రియలో బీఎల్‌వోలు తమ విధులు అంకిత భావంతో నిర్వహించటంతో పాటు అన్నీ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు తమవంతు సహకారం అందించాలన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ చంద్రబాబు, పి.నాసరయ్య ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: భార్యభర్తల మధ్య వివాదం నేపథ్యంలో భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండలంలోని తాతపూడి గ్రామానికి చెందిన నర్రా సురేష్‌తో మృదుల (31)కు ఎనిమిది సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ఈ నెల 16 తేదీ భార్యభర్తలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మృదుల 17వ తేదీ తెల్లవారు జామున అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరెతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన భర్త, బంధువులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రూరల్ పోలీసులు మృతురాలి తండ్రి గరికపాటి వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారి పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గోవిందాంబ సమేత శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి పరివార దేవతా ప్రతిష్ఠా మహోత్సవం రెండవ రోజు కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పుణ్యాహవాచనం, కుంభారాధనం, అగ్నిప్రణయణం, హారతి, మహా శాంతి ఆవాహనం, పుష్పాధివాసం, ప్రధాన దేవ తల ఆవాహనం, లఘు పూర్ణాహుతి, హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: నవరత్నాలతో పాటు అదనంగా పలు సంక్షేమ పథకాలు సీఎం జగన్ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ఇందుకు విరుద్ధంగా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న రాజకీయ విమర్శలు పట్టించుకోకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డు సచివాలయాల పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ బుట్టి శ్యామలాదేవి చంద్ర ఆధ్వర్యంలో పీఆర్కే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే పలువురు లబ్ధిదారులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం ప్రతి గడపను తాకి వారి సమస్యను తెలుసుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినూత్నంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ పీఆర్కే గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరితో మాట్లాడి ఎక్కడైనా సమస్య వస్తే తెలుసుకుని అక్కడికక్కడే అధికారులకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే కాన్వాయ్‌లో తరలి రాగా మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చల్లా శ్రీను, చల్లా కాశి, ఇసుక అంజితో పాటు పలువురు బిసి నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గడపనూ ఎమ్మెల్యేలు సందర్శించి నవరత్నాల అమలు తరువాత కూడా మిగిలి ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, ప్రజలు 287 గడపలను పీఆర్కే సందర్శించి ప్రతి కుటుంబానికి చేకూరిన ప్రయోజనాన్ని వివరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, ఆయా వార్డు కౌన్సిలర్‌లు గట్ల కోటిరెడ్డి, షేక్ దస్తగిరి, పోలా శ్రీను, తేరాల సిద్ధయ్య, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మందా సంతోష్, ఎన్ శ్రీనివాస్, షేక్ సుభాని, కరిముల్లా, మస్తాన్, రామగాని శంకర్, చందూ గౌడ్, కో ఆప్షన్ మెంబర్‌లు అల్లి జీవన్, అనంతరావమ్మ, యాసిన్, అల్లావుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కమిషనర్ రమణబాబు, ఏఈ సామేల్ పలువురు నాయకులు పాల్గొన్నారు. వార్డులో ప్రారంభం నుంచి గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసే వరకు వార్డులోని పలువురు మహిళలు, ప్రజలు పీఆర్కేకు జేజేలు పలుకుతూ పూలు చల్లుతూ, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు.

సరిహద్దు చెక్‌పోస్ట్ నూతన భవనం ప్రారంభం



చెక్‌పోస్ట్ నూతన భవనం ప్రారంభిస్తున్న డీటీసీ పరందామరెడ్డి

దాచేపల్లి : రవాణశాఖ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా రూ. 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని మండలంలోని పొందుగల గ్రామ సరిహద్దులో డీటీసీ పరందామరెడ్డి, సాగర్ సిమెంట్స్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ పి. బిక్షారెడ్డి ప్రత్యేకంగా పూజలు చేసి ప్రారంభించారు. ఇప్పటి వరకు సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో సరిహద్దు చెక్‌పోస్ట్ కార్యకలపాలు నిర్వహిస్తున్నామని, త్వరలో నూతన భవనం నుంచి సరిహద్దు చెక్‌పోస్ట్ కార్యకలపాలు నిర్వహిస్తామని డీటీసీ పరందామరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఎంవీఐ శేషరెడ్డి, ఎఎంవీఐలు బి. శ్రీనివాసరావు, సురేష్, కెఎల్. రావు, సాగర్ సిమెంట్స్ జీఎం ప్రభాకర్‌రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇల్లు ఆర్థికంగా ఎదగాలి: యడ్లపాడు ఎంపీపీ

యడ్లపాడు: ప్రతిబిడ్డా చదవాలి.. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలి అన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని దానిని అంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ ఝాన్సీ మాట్లాడుతూ నవరత్న పథకాలతో కుటుంబ ఆర్థిక పరిపుష్టి చేస్తూనే ఆయా కుటుంబాల్లోని పిల్లల్ని మంచి విద్యావంతుల్ని చేయడమే లక్ష్యంగా అనేక నాడు–నేడుతో సర్కారు పాఠశాలల రూపురేఖల్ని మార్చారన్నారు. ఈ నేపథ్యంలో యడ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో ప్లస్‌టూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారని, గ్రామీణ ప్రాంత బాలికలు సద్వినియోగం చేసుకునేలా ప్రజా ప్రతినిధులు ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు. గడపగడపకూ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొని అన్నిగ్రామాల్లోని గృహాలకు వెళ్లి నాలుగేళ్ల పాలనల్లో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ..స్థానిక సమస్యల్ని తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల పరిశుభ్రతకు పంచాయతీలతో పాటు ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నరసరావుపేట టౌన్: విద్యార్థిని మిస్సింగ్ కేసును వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. అదృశ్యమైన బాలికను శుక్రవారం సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిరంగిపురం మండలం సుదురుపాడు గ్రామానికి చెందిన 17 సంవత్సరాల బాలిక నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సం చదువుతోంది. బుధవారం కళాశాలకు అని చెప్పి ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరిన బాలిక తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ అశోక్ కుమార్ దర్యాప్తును ప్రారంభించారు. కళాశాల సిబ్బందిని, విద్యార్థిని స్నేహితులను విచారించారు. విజయవాడ బస్టాండ్‌లో బాలిక ఉన్నట్లు సమాచారం అందుకున్న సీఐ అశోక్‌కుమార్ వెంటనే అక్కడికి వెళ్లి బాలికను సురక్షితంగా స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణలో మానసిక ఒత్తిడి వల్ల తాను ఇంటి నుంచి వెళ్లినట్లు బాలిక పోలీసులకు వివరించింది. తల్లిదండ్రులను రప్పించి బాలికను అప్పగించారు.

ఈ-పంట నమోదు త్వరగా పూర్తిచేయండి

వ్యవసాయాధికారులకు సూచించిన జిల్లా అధికారి



చిన్నతురకపాలెం గ్రామంలో ప్రత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నరసరావుపేట: జిల్లాలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నరసరావుపేట మండలంలోని గోనెపూడి ఆర్‌బీకే పరిధిలో పరిశీలించారు. ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో తెలుసుకున్నారు. ఆర్‌బీకేలో రికార్డులను తనిఖీ చేసి సూచనలు చేశారు. అనంతరం చిన్నతురకపాలెం గ్రామ పరిధిలో ప్రత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. గడిచిన సీజన్‌తో పోల్చితే ఈఏడాది ప్రత్తిసాగు తగ్గి మొక్కజొన్న సాగువైపు రైతులు మొగ్గు చూపినట్లుగా తెలిపారు. అందువలన రైతులు మేలైన మొక్కజొన్న విత్తనాలకోసం ఆర్‌బీకేల ద్వారా వీఏఏలకు తెలియచేస్తే వారికి మేలైన విత్తనాలను విక్రయించే సదుపాయం కల్పిస్తారన్నారు. ఏడీఏ పి.మస్తానమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంఈఓ రాజకుమారి

బెల్లంకొండ: విద్యార్థులు ఖాళీగా ఉన్న సమయాలలో గ్రంథాలయ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఎంఈఓ బి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఎస్ఆర్ఐ- వాసవి అసోసియేషన్ వారు రూ.38వేల విలువ చేసే గ్రంథాలయ పుస్తకాలను అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని, వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎంఈవో-2 బాల సుందరరావు మాట్లాడుతూ గ్రంథాలయ పుస్తకాల ద్వారా ప్రపంచంలోని విశేష వ్యక్తులు, వివిధ భాషలతో గల పుస్తకాలు, వాటిలోని నీతి, ధర్మ సూక్ష్మములు గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నేత్ర, దంత వైద్యసేవలందించాలి

క్రోసూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర, దంత వైద్య సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు జమీలా గఫార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మించుకున్న ఇళ్లకు హౌసింగ్ శాఖ బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈ వెంకట్రావుకు విన్నవించారు. స్పందించిన ఏఈ, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్లతో పాటు మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేసుకున్న వారు బిల్లులు పొందవచ్చని వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ బి.మహేష్ పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోండి

గురజాల: అత్యాచార నిరోధక చట్టం, వెట్టి చాకిరి నిర్మూలన చట్టం, దేవదాసీ నిర్మూలన చట్టం, పారిశుద్ధ్య పనివారల పునరావాస చట్టం అమలు పరచుటకు సబ్ డివిజన్‌లో విజిలెన్స్, మోనటరింగ్ కమిటీల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా నూతన కమిటీల ఏర్పాటు చేయుటకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ డివిజన్ అధికారి కె అద్దెయ్య పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తులు అందించాలన్నారు.

ఉచిత చర్మ, రక్తనాళాల వైద్యశిబిరం

పిడుగురాళ్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల(అక్షయ) సంఘం, ఏషియన్ వాస్కర్ హాస్పటల్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత చర్మ, రక్తనాళాల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానం టింబర్ డిపో సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉదయం 10 గంటలను నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని వారు తెలియజేశారు.

మణిపూర్ ఘటన అమానుషం

గురజాల : మణిపూర్‌లో జరిగిన ఘటన అమానుషమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యూగనిరాజు అన్నారు. స్థానిక నందనం వెంకటరావు నగర్ కాలనీలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసిలపై జరుగుతున్న మారణహోమాన్ని నిలుపుదల చేయాలని, ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ పోతురాజు, జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డి శ్రీను, నాయకులు షేక్ నబీ, యలమంద, శ్రీను, లింగయ్య తదితరులున్నారు.

మైనర్ బాలిక అదృశంపై ఫిర్యాదు

మాచవరం: మైనర్ బాలిక కనిపించడం లేదంటూ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు. మండల పరిది గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 15 అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి పోయింది. బాలిక ఆచూకీ కోసం బందుమిత్రల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేటటౌన్: డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం డైరెక్టర్ బి.బాలునాయక్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పురుషోత్తమపట్నం మండల సమాఖ్య కార్యాలయంలో మండలస్థాయి వీవోఏల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోన్లు తీసుకొనే ప్రతి గ్రూపు వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీపీఎం కె.హనుమంత్‌నాయక్, ఏపీఎం భరత్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నూజెండ్ల మండలం నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన నాదెండ్ల మోహన్‌రావు, గోగు నాగేశ్వరరావులు వ్యక్తిగత పనులపై వినుకొండ వస్తుండగా వినుకొండ నుంచి యర్రగొండపాలెం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టడంతో గోగు నాగేశ్వరరావు (45) అక్కడికక్కడే మృతిచెందగా మోహన్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు.

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జిలానీ

నరసరావుపేట: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా అమ్మా జిలానీ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని జిలానీకి సూచించారు. సీనియర్ నాయకులు కృపారావు, హనుమంతరావు, మధుబాబు, రవిశంకర్ అభినందించారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



దాచేపల్లిలోని కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దాచేపల్లి : శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో కూడా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

శ్రావణ మాస పూజలు



శ్రీవాసవి కన్యక పరమేశ్వరి మూలవిరాట్

మాచర్ల: పట్టణంలోని శ్రీవాసవి కన్యక పరమేశ్వరి, శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి, శ్రీ కనకదుర్గ, శ్రీ భ్రమరాంబ, శ్రీ గాయాత్రిదేవి, శ్రీలలితాంబ, శ్రీ ఆదిలక్ష్మి, శ్రీమహాలక్ష్మి, శ్రీ చౌడేశ్వరి అమ్మవార్ల దేవాలయాలలో శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలలో అమ్మవార్లకు తెల్లవారుఝామునే ప్రత్యేక అలంకరణలు చేసి శ్రావణ మాస పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు సందర్భంగా భూమి పూజ చేస్తున్న పీవీఆర్

దుర్గి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శుక్రవారం కంచరగుంట గ్రామంలో భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఆర్‌ని సత్కరించారు. ముందుగా చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం పీవీఆర్ మాట్లాడుతూ వైఎస్సార్ పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన పై ప్రేమతో స్థానిక నేతలు, ప్రజలు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన తనయుడు సీఎం జగన్ అవినీతి రహిత పాలన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల నియోజక వర్గం అభివృద్ధిలో ఉందన్నారు. త్వరలోనే వరికపూడిసెల నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. యానాది కాలనీ వాసులు నూతనంగా నిర్మిస్తున్న దుర్గా భవాని ఆలయ నిర్మాణానికి ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు కుంకుమ తిలకం దిద్ది సాదారణంగా ఆహ్వానించి తమ ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలో వెల్దుర్తి ఎంపీపీ చింతా ఆదినారాయణ, సర్పంచ్ బీర్నీడి మాణిక్యరావు, ఎంపీటీసీ బొంత కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు, దేవరకొండ పున్నారావు, పెద్ద సాంబయ్య, మాదాసు వాసు, కోట రాజు, వేముల వెంకటేశ్వర్లు మాస్టర్, మాచర్ల టౌన్ వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కందుకూరి రత్నరాజు, రాజానగరం మాజీ సర్పంచి జక్కా రమేష్, బోజ్యానాయక్, బొంత గాంధీ, మోతీలాల్ నాయక్, సచివాలయం కన్వీనర్లు శ్రీరామ్‌మూర్తి, దానయ్య, కల్లూరి రాజేష్, సుబ్రహ్మణ్యం నాయక్, కోట శిమోను, దేశం నాగిరెడ్డి, మాదాసు శ్రీనివాసరావు, కొండలు, రాళ్ళపల్లి శ్రీను, మాదాసు గోపయ్య, కోట శివ, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

మాచర్ల: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన చేసి మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. పట్టణంలోని 30వ వార్డులో కోట శిలువమ్మ నిర్మిస్తున్న భవనానికి మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్ కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, పాస్టర్ల అసోసియేషన్ నాయకులు వేల్పుల గురవయ్య, దాసుతో పాటు పలువురు పాల్గొన్నారు.

21న రాష్ట్ర మహాసభ



మహాసభ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న అధికారులు

గురజాల: విజయవాడలో ఈ నెల 21వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎన్‌జీఓ సంఘం నాయకుడు హనుమంతరావు కోరారు. ఈ మహాసభలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మాచవరంలో

మాచవరం: ఈనెల 21న విజయవాడలో జరిగే ఏపీ ఎన్‌జీఓ మహాసభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎన్‌జీఓ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పట్టాభి పిలుపు నిచ్చారు. మహాసభకు సమీకరణలో భాగంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గోడప్రతులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కావున ఎన్‌జీఓ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులందరూ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, హెల్త్ సూపరవైజర్లు సురేష్, శ్రీనివాసరావు, చిన్నారి రోజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

21న మహాసభ

మాచర్ల: రాష్ట్ర ఎన్‌జీఓ 21వ మహాసభలను జయప్రదం చేయాలని మాచర్ల నియోజక వర్గ తాలూకా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గిరిరాజు నరింహబాబు, మెట్టు రఘురామిరెడ్డి కోరారు. శుక్రవారం మాచర్ల పట్టణంలో రాష్ట్ర ఎన్‌జీఓ మహాసభల కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21, 22లో జరిగే ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగులు ఈ మహాసభలకు హాజరై ఆయా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని కోరారు.

మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిన ఏసోబు



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చిన ఏసోబును సన్మానించి మిఠాయి తినిపిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: పట్టణంలో నూతనంగా మున్సిపల్ చైర్మన్ అయిన మాచర్ల చిన ఏసోబు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అయిన మాచర్ల చిన ఏసోబును అభినందిస్తూ ప్రభుత్వ విప్ పీఆర్కే మిఠాయి తినిపించి శాలువతో సత్కరించారు. దళితుడిగా తనకు ఇటువంటి అవకాశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మీరందించినందుకు కృతజ్ఞతతో మాచర్ల మున్సిపాలిటీని అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ పీఆర్కేను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పాస్టర్లు ఐజయ్య, యోగిరాములు, వేల్పుల దానియేలు, వివిధ చర్చి పాస్టర్లు, ఆయా వార్డు కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com